మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 7-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 70 Issue: 70

07 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:21 తిథి ఏకాదశి సా. 5:05 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పునర్వసు సా. 6:12 వరకు తరువాత పుష్యమి యోగం వ్యతీపాత ఉ. 6:35 వరకు కరణం బవ ఉ. 6:16 వరకు భాలవ సా. 5:05 వరకు వర్జ్యం ఉ. 7:03 నుండి ఉ. 8:32 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:27 వరకు మ. 3:05 నుండి మ. 3:54 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు యమగండం ఉ. 10:42 నుండి మ. 12:14 వరకు గుళికాకాలం మ. 1:46 నుండి మ. 3:17 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 3:59 నుండి సా. 5:29 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana Published from Jagitial


# బూతుల వీరుడు



## సీఎంగా ఉండి బూతులు మాట్లాడుతున్నడు

## అలాంటోడితో అసెంబ్లీలో చర్చ పెట్టాల్నా?

## అసెంబ్లీకి కాదు.. ప్రజల్లోకి వెళ్తా

## లక్ష మందితో కాళేశ్వరం, పాలమూరు వద్దకు

## అవసరమైతే మరోసారి పాదయాత్ర చేస్తా

## కాంగ్రెస్‌ది థర్డ్ క్లాస్, ఫాలింగ్ పాలన

## బీఆర్ఎస్ఎల్పీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

'రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి బూతులు మాట్లాడుతున్నాడు. ఆ బూతుల వీరుడు చర్చలకు అసెంబ్లీకి రమ్మంటున్నాడు. బూతులు మాట్లాడే వారితో చర్చించేందుకు నేను అసెంబ్లీకి రావడం అవసరమా..?' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి జరుగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కేసీఆర్ సమావేశమై, అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

సిద్దిపేట/హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్లు ఇస్తున్నారు.. అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది థర్డ్ క్లాస్ పాలన.. తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్ కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి కాదు.. ప్రజల్లోకే వెళ్దామని సూచించారు. తెలంగాణ ఉద్యమం సాగింది, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది, సాగునీరు తాగునీరు కోసమేనని, తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టులపై చేసినవి దుష్ప్రచారాలనీ, కుట్ర పూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైపోయిందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయడం సహించేది లేదన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాపంటలకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం మీద జల యుద్ధానికి సిద్ధం కావాలని కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పార్టీలోని ఇతర ముఖ్య నేతలతో కలిసి కూర్చొని చర్చించి త్వరలోనే ప్రత్యక్ష కార్యాచరణకు విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీ సభ్యులను సభలో తూలనాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాన్ని ఉభయ సభల్లో తిప్పికొట్టాలని పార్టీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు అధినేత కేసీఆర్ -2 వ పేజీలో...

# ఇస్రో ప్రైవేటీకరణ అబద్ధం

ISRO

## దేశ అంతరిక్ష ప్రయోగాల్లో మా పాత్ర తగ్గదు

## అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతాం

## సామర్థ్యం పెంపునకే 'ప్రైవేట్'తో భాగస్వామ్యం

### 2035 నాటికి భారత అంతరిక్ష స్టేషన్ ఏర్పాటు లక్ష్యం: ఇస్రో







భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.

బెంగళూరు: ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో తరువాయి 2 వ పేజీలో...



# మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం.. 12 మంది మృతి

## సాగర్ జిల్లాలో దారుణం.. 10 మందికి పైగా అస్వస్థత

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం పెను విషాదాన్ని నింపింది. అనుమానాస్పద విషపూరిత మద్యం సేవించి 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ప్రభావిత గ్రామాల్లో వైద్య పరీక్షలు ప్రారంభించి, ముందుజాగ్రత్త చర్యగా పలు మద్యం దుకాణాలను సీల్ చేశారు. ఈ ఘటనపై -2 వ పేజీలో...

# మూడో వారం నుంచి వానలు!

## నాలుగో వరకు కొనసాగే అవకాశం

### కరువు జాడలను పసిగట్టిన ప్రకృతి.. చాలా చోట్ల విరివిగా జిల్లేడు చెట్లు



తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ ఉపశమనం కలిగించే వార్తను వెల్లడించింది. సెప్టెంబర్ 11, 12 తేదీల తర్వాత రాష్ట్రంలో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సెప్టెంబర్ మూడో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వర్షాల ప్రభావం సెప్టెంబర్ నాలుగో వారం వరకు కొనసాగే అవకాశముందని పేర్కొంటున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే కనీసం ఆరు నుంచి ఏడు రోజుల పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో విస్తారమైన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. మిగిలిన రోజుల్లోనూ మోస్తరు వర్షాలు, జల్లులు -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,480 |
| వెండి (కిలో): | రూ.2,,54,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,513 |

# ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై స్పెషల్ డ్రైవ్

## బలవంతపు వసూళ్లపై డీజీపీ సీరియస్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



సంప్రదాయ ఫ్లాష్ మెమరీతో పోలిస్తే దాదాపు 10 వేల రెట్లు వేగంగా సమాచారాన్ని రాసే ప్రయోగాత్మక మెమరీ సాంకేతికతను పరిశోధకులు అభివృద్ధి చేశారు. 'పోక్స్'గా పిలిచే ఈ సాంకేతికతలో గ్రాఫీన్‌ను ఉపయోగించారు. సాధారణ ర్యామ్ వేగంగా పనిచేసినా విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమాచారం తొలగిపోతుంది. అయితే పోక్స్ సాంకేతికతతో ఇందులో సమాచారాన్ని కేవలం 400 పికోసెకన్లలో రాయగలిగారు. అంటే సెకనుకు సుమారు 2,500 కోట్ల చర్యలు నిర్వహించే సామర్థ్యం అన్నమాట. కృత్రిమ మేధస్సు సాయంతో పరికరం రూపకల్పనను మరింత మెరుగుపరిచారు.





# కొత్తగా 250 ఎస్బీఐ బ్రాంచీలు

## 12 వేల కొత్త ఉద్యోగాలు

## భారీ విస్తరణకు ఎస్బీఐ కార్యాచరణ

# హైదరాబాద్‌లో అహింసా స్థూపం



## ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### అహింస గొప్ప బలమని వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం తరువాయి 2 వ పేజీలో...

# ప్రపంచ పటానికి ఓకే..



## భారత్ పటం మారితే మర్యాద ఉండదు

## ఐక్యరాజ్యసమితికి భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రపంచ భౌగోళిక మ్యాప్‌లకు సంబంధించిన ఓ కీలక తీర్మానానికి భారతదేశం మద్దతు తెలిపింది. అయితే, దీనికి మద్దతు ఇవ్వడం ద్వారా ఏదో ఒక ప్రత్యేక మ్యాప్‌నకు లేదా తప్పుడు సరిహద్దులకు తాము ఆమోదం తెలిపినట్లు కాదని విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలను మ్యాప్‌లో తప్పుగా చూపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ -2 వ పేజీలో...




## రాశి ఫలాలు

7.9.2026

మేషం: బంధువులతో వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించాలి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

వృషభం: వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తప్పవు. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఋణదాతల నుండి ఒత్తిడులు అధికమవుతాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

మిధునం: మొండి బాకీలు వసూలు చేసుకుంటారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ ప్రముఖుల నుండి సభ, సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి.

కర్కాటకం: ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందగలుగుతారు. అవసరానికి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపార పరంగా తీసుకున్న నిర్ణయాలు అనుకూల ఫలితాలనిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. సంతాన వివాహ విషయమై చర్చలు ఫలిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

సింహం: వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి.పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి.

కన్య: విద్యార్థులకు ఒత్తిడులు తప్పవు. చేపట్టిన పనుల్లో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగుతాయి. ఉద్యోగపరంగా అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు కొంత నిరుత్సాహపరుస్తాయి.

తుల: వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. గృహమున కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. విందు వినోదాది కార్యక్రమాలకు హాజరు అవుతారు.

వృశ్చికం: చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధుమిత్రుల నుంచి కొన్ని పనులలో ఒత్తిడి అధికమవుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

ధనస్సు: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఒత్తిడి నుండి బయట పడతారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. నిరుద్యోగుల యత్నాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆరోగ్యపరంగా కొంత జాగ్రత్త అవసరం.

కుంభం: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సమాజంలో ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మీనం: కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందు వినోద కార్యక్రమాలకు హాజరవుతారు.




# బూతుల వీరుడు

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్ జలాలను తెలంగాణ రైతాంగానికి అందకుండా పక్కరాష్ట్రం ఉపయోగించుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలా తొంభై శాతం పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేసినా, కృష్ణా జాలాలను ఎత్తిపోసి నల్గొండ పాలమూరా రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు తాగునీటిని ఎందుకు అందించలేక పోతున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డ దగ్గర చిన్న రిపేర్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల్లో రైతాంగం పంటలు పండించుకుంటారని, మరి ఎందుకు ఆ ప్రయత్నం చేస్తలేరో ప్రజలకు స్పష్టం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాళేశ్వరంపై ఇదే పద్ధతిలో నిర్లక్ష్యం వహిస్తే, అన్యాయానికి గురవుతున్న రాష్ట్ర రైతాంగానికి సాగునీటి కోసం తానే స్వయంగా లక్షలాది మందితో కార్యాచరణ ప్రకటిస్తానని, సాగునీటి కోసం తిరిగి మరో యుద్ధానికి సిద్ధమౌదామని పిలుపు నిచ్చారు.

హామీలపై నిలదీయాలి

వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలను, హామీలను వెయ్యి రోజులైనా అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందిందో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనా వైఫల్యం మీద బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల అధినేత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను పార్టీ ముఖ్యనేతలను జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. పేద ప్రజల సంక్షేమం మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నదనే విషయాన్ని ఉభయ సభల్లో నిలదీయాలని ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. గ్రామాలు పట్టణాల్లోని పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల వివాహాలు, దవాఖాన ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తమ భూమిని అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య మీద ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కేసీఆర్ స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీళ్లు వున్నా తెలంగాణ రైతాంగానికి ఎందుకు విడుదల చేయట్లేదనే విషయం మీద ప్రభుత్వాన్ని పట్టు పట్టాలని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, మిషన్ భగీరథ వంటి తాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసి, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చకపోవడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలి అని కేసీఆర్ దుయ్యబట్టారు. ఇదే విషయాన్ని సభాముఖంగా నిలదీయాలన్నారు.

జీవో 97పై గళమెత్తాలి

నిరుపేదల పిల్లలు ఉన్నత చదువులు చదువుతూ, వారి భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకునే క్రమంలో అమలు చేసిన ఫీజు రియింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం పట్ల కెసిఆర్ మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపుల పై విద్యార్థుల పక్షాన అసెంబ్లీ వేదికగా పోరాడాలన్నారు. పాలిటెక్నిక్ విద్యను భ్రష్టు పట్టించే విధంగా జీవో 97ను తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని సభ్యులకు కేసీఆర్ స్పష్టం చేశారు. సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు, వృత్తి నైపుణ్యాన్ని సొంతం చేసుకుని భవిష్యత్తు ఉపాధిని సంపాదించుకుంటారని, అట్లా పలు రంగాలకు సంబంధించిన సాంకేతిక వృత్తి విద్యను అందించే పాలిటెక్నిక్ ను స్వార్థ ప్రయోజనాల కోసం ఫణంగా పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలన్నారు. ఎన్నికలు రాకముందు నిరుద్యోగులను ఉసిగొల్పి, లక్షలాది ఉద్యోగాలు ఇస్తానని నమ్మపలికిన కాంగ్రెస్ హామీలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ఇదే విషయంపై రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపు హామీలను ప్రశ్నిస్తున్నారని, వారికి మద్దతుగా ఉభయ సభల్లో సభ్యులు గళం విప్పాలని కేసీఆర్ తెలిపారు. నిరుద్యోగ నోటిఫికేషన్ల కోసం జాబ్ క్యాలెండర్ల అమలు కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో అవినీతి

ప్రపంచ స్థాయి నాణ్యతతో కూడిన ఫార్మా ఇండస్ట్రీని పెద్ద ఎత్తున నెలకొల్పేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫార్మాసిటీని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేదల భూములను రియల్ ఎస్టేట్ దందా కోసం ఉపయోగించుకునే విధంగా ఫ్యూచర్ సిటీ పేరుతో అత్యంత దుర్మార్గమైన అవినీతి తతంగానికి తెరలేపిందని కేసీఆర్ దుయ్యబట్టారు. ఈ సమస్యమీద ఉభయ సభల్లో ప్రశ్నించాలన్నారు. తెలంగాణ సిరుల వెలుగు సింగరేణి గనుల్లో అవినీతి పెచ్చు మీరిందని, సింగరేణి కుంభకోణాలకు నెలవుగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఉభయసభల్లో పార్టీ సభ్యులు ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వ భూములను భవిష్యత్తు తరాల అవసరాలకు ఏమాత్రం మిగిల్చకుండా, తమ ఇష్టా రీతిన అక్రమ అమ్మకాలు చేపడుతున్న ప్రభుత్వ చర్యలను నిలదీయాలన్నారు. సజావుగా నడుస్తున్న మెట్రో రైలు నిర్వహణను అనాలోచిత విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తన చేతిలోకి తీసుకున్నదని, తద్వారా రాష్ట్ర ఖజానా పై విపరీతమైన భారాన్ని మోపడమే కాకుండా నిర్వహణ చేతగాని పరిస్థితిలోకి నెట్టివేయబడిందని, ఇటువంటి తప్పుడు నిర్ణయాల మీద ఉభయ సభల్లో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలనీ పార్టీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. గోదావరి కావేరి నదుల లింకు ప్రాజెక్టు పేరుతో రాష్ట్రానికి తీవ్ర నష్టానికి ఒడిగడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఉభయసభల్లో ప్రశ్నించాలని అన్నారు. మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలను ఉద్దేశ పూర్వకంగా నిర్వీర్య చేస్తున్న ప్రభుత్వ కుట్ర మీద నీటి యుద్ధానికి సిద్ధం కావాలని పార్టీ అధినేత పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్ర రైతాంగం ప్రజలు సాగునీటి తాగునీటి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసినా, ఎత్తిపోయడానికి ఎందుకు అలసత్వం వహిస్తున్నారని నిలదీశారు. ఇదే విషయం మీద ఉభయ సభలను స్తంభింప చేయాలని కెసిఆర్ స్పష్టం చేశారు. ఇదే విషయంపై తాను త్వరలో పార్టీ ముఖ్య నేతలతో జిల్లా నేతలతో చర్చించి లక్షలాది మందితో కార్యాచరణను చేపట్టనున్నట్టు కేసీఆర్ పునరుద్ఘాటించారు.

ఉచిత విద్యుత్తకు ఎసరు పెట్టే విధంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న నిర్ణయాలను వినియోగదారుల పై తీవ్రమైన ప్రభావం చూపుతుందనీ కేసీఆర్ అన్నారు. అడ్డగోలుగా వస్తున్న బిల్లులు చెల్లించలేక పేదలు, మధ్యతరగతి ఇప్పటికే బాధలు పడుతున్నారని, విద్యుత్ సరఫరా రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిందని, రైతు డిస్కం ఏర్పాటుతో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ని ఎత్తివేసే కుట్ర దాగి ఉన్నదని కేసీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విద్యుత్ విధానాలపై ఉభయ సభల్లో నిలదీయాలన్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు వారి ఉద్యోగ విరమణ సందర్భంగా చెల్లించాల్సిన పిఎఫ్ వంటి నిధులను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు అన్నారు. తమ జీవితకాలం నిర్వర్తించిన వృత్తిలో దాచుకున్న డబ్బును తిరిగి ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రాట్లేవని, కొంతమంది డబ్బు అందక మరణించిన వార్తల పట్ల కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమ సమస్యల గురించి అడిగితే రెండేండ్ల పాటు ఏమీ అడగవద్దు అనడం అన్యాయమని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. ఉద్యోగులు ,రిటైర్ ఉద్యోగుల సమస్యలు, పిఆర్సి పెండింగ్ వంటి సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన బి ఆర్ ఎస్ ఎల్ పి సంయుక్త సమావేశంలో, రాష్ట్ర ప్రజల సంక్షేమం రాష్ట్ర ప్రగతి పరిస్థితిపై కేసీఆర్ లోతుగా చర్చించారు. ప్రభుత్వ పనితీరుపై అసెంబ్లీ సమావేశాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, శాసనసభాపక్ష ఉప నేతలు తన్నీరు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మండలి ఉపనాయకులు ఎమ్మెల్సీలు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం.. 12 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

సాగర్ జిల్లాలో దారుణం.. 10 మందికి పైగా అస్వస్థత ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "సంబంధిత మంత్రి, అధికారులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇలాంటి వాటిని మా ప్రభుత్వం ఎంతమాత్రం సహించదు" అని ఆయన మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మరణాల నేపథ్యంలో జిల్లాలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "బాంబే విస్కీ" పేరుతో ఓ నకిలీ బ్రాండ్‌ను విక్రయిస్తున్నారని, దీనిపై ఓ మద్యం కాంట్రాక్టర్ ఇటీవలే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానిక కథనాలు పేర్కొంటున్నాయి.

## కొత్తగా 250 ఎస్బీఐ బ్రాంచీలు

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు చైర్మన్ తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై స్పెషల్ డ్రైవ్

మొదటి పేజీ తరువాయి



చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

# హైదరాబాద్‌లో అహింసా స్థూపం

మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరో పగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్-జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు.

# ఇస్రో ప్రైవేటీకరణ అబద్ధం

మొదటి పేజీ తరువాయి

ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది. భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# ప్రపంచ పటానికి ఓకే..

మొదటి పేజీ తరువాయి

అంగీకరించబోమని ప్రపంచ దేశాలకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. సెప్టెంబర్ 4న యూఎన్ జనరల్ అసెంబ్లీలో ఆఫ్రికా దేశాల పరిమాణానికి ప్రాధాన్యతనిస్తూ ఒక కొత్త రిజల్యూషన్ ఆమోదం పొందింది. ఖండాల పరిమాణాన్ని కచ్చితంగా చూపించే 'ఈక్వల్-ఏరియా' మ్యాప్ ప్రొజెక్షన్స్‌ను వాడాలని ఈ తీర్మానం ప్రోత్సహిస్తోంది. ఈ ఓటింగ్‌లో భారత్ కూడా అనుకూలంగా ఓటు వేసింది. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ క్లారిటీ ఇచ్చారు. "ఈ తీర్మానం ఏ రాజకీయ సరిహద్దులనో లేదా వివాదాస్పద ప్రాంతాలనో డిసైడ్ చేయదు. భారతదేశ సార్వభౌమాధికారం, భౌగోళిక సరిహద్దుల విషయంలో మా స్టాండ్ చాలా క్లియర్. జమ్మూకశ్మీర్ (జీడఖ), లద్దాఖ్ (ఝుఝునెష్ట్ర) లు పూర్తిగా మా భూభాగాలు. వాస్తవ భౌగోళిక రేఖలకు విరుద్ధంగా వాటిని మ్యాప్‌లో తప్పుగా చూపిస్తే అస్సలు ఒప్పుకోం. ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

# మూడో వారం నుంచి వానలు!

మొదటి పేజీ తరువాయి

కొనసాగే పరిస్థితులు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. దీంతో కొంతకాలంగా ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే వర్షాల తీవ్రత ప్రాంతాన్ని బట్టి మారే అవకాశం ఉండటంతో స్థానిక వాతావరణ హెచ్చరికలను ప్రజలు గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. విస్తారమైన వర్షాలు కురిస్తే సాగులో ఉన్న పంటలకు కొంత మేలు జరిగే అవకాశం ఉంది. కాగా, కరువు తాండవించే అవకాశం ఉందని ప్రకృతి ముందుగానే పసిగట్టింది. తీవ్ర కరువు వచ్చే సందర్భాల్లో జిల్లేడు చెట్లు విరివిగా పూస్తాయి. ప్రస్తుతం అనేక చోట్ల జిల్లేడు చెట్లు మొలుస్తున్నాయి.

# కొండగట్టులో నూతన వాహన పూజా షెడ్డు



కొండగట్టు, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతన వాహన పూజా షెడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. 'వై' జంక్షన్ సమీపంలో సుమారు 60ఐ100 అడుగుల విస్తీర్ణంలో, 25 అడుగుల ఎత్తుతో షెడ్డు నిర్మించనున్నారు. పనులను 30 నుంచి 40 రోజుల్లో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రి వేళల్లో సుమారు వెయ్యి మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా సౌకర్యాలు కల్పించనున్నారు. భూమిపూజ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండగట్టు దేవస్థాన సమగ్ర అభివృద్ధికి చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలోని సుమారు 180 ఎకరాల అటవీ భూమిని దేవస్థానానికి బదలాయించడంతోపాటు, అందుకు ప్రతిగా దేవస్థాన భూమిని అటవీ శాఖకు బదలాయించే ప్రక్రియపై కసరత్తు జరుగుతోందన్నారు. సంబంధిత ఫైలును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. దేవస్థాన సమగ్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం సర్వేలు, సాంకేతిక, పరిపాలనా ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో చేపట్టనున్న రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నామని, అనంతరం టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రానున్న హనుమాన్ జయంతి నాటికి భక్తులకు స్పష్టమైన మార్పులు కనిపించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి 20 వరకు శ్రీ స్వామివారి చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని, నవంబర్ 20న ఉదయం 9.57 గంటలకు సుముహూర్తం నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు.

## పట్టించుకోరే.. పగలూ వెలుగుతున్నా!



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): 'నా గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.. కనీసం పగలు అయినా విశ్రాంతి ఇవ్వండి' అంటూ వేములవాడ పట్టణంలోని ఓ వీధిలైటు మూగవేదన వ్యక్తం చేస్తోంది. పోచమ్మవీధి మెయిన్ రోడ్డులోని ఓ వీధిదీపం గత 15 రోజులుగా ఎండనక, వాననక 24 గంటలూ నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. మిగతా వీధిలైట్లు రాత్రివేళ మాత్రమే వెలుగుతుండగా, ఈ దీపం మాత్రం పగలు, రాత్రి తేడా లేకుండా మండుతోంది. మరోవైపు పోలీస్‌స్టేషన్ నుంచి కోరుట్ల బస్టాండ్ మెయిన్‌రోడ్డు వరకు పలు ప్రాంతాల్లో సెంటర్ లైటింగ్ పనిచేయడం లేదని స్థానికులు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పగలు వెలుగుతున్న దీపాన్ని సరిచేయడంతోపాటు, పనిచేయని సెంటర్ లైట్లను కూడా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.




## గుజరాత్‌లో తెలంగాణ మీడియా బృందం

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (పీఐబీ): పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన 10 మంది పాత్రికేయుల బృందం గుజరాత్‌లో పర్యటిస్తోంది. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు వారం రోజులపాటు జరిగే ఈ పర్యటనకు మీడియా కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి నాయకత్వం వహిస్తున్నారు. ఆదివారం అహ్మదాబాద్ చేరుకున్న బృందానికి పీఐబీ అధికారులు స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టుల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంతోపాటు రాష్ట్రాల మధ్య అభివృద్ధి అనుభవాలను పంచుకోవడం పర్యటన ఉద్దేశమని పీఐబీ తెలిపింది. ఇందులో భాగంగా సబర్మతీ రివర్‌ఫ్రంట్, ధోలేరా ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం, గిఫ్ట్ సిటీ, అమూల్ డెయిరీ, ఐక్యతా మూర్తి, సర్దార్ సరోవర్ ఆనకట్ట తదితర ప్రాంతాలను బృందం సందర్శించనుంది. సీఈపీటీ విశ్వవిద్యాలయం, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, సబర్మతీ మల్టీమోడల్ హబ్‌లను కూడా సందర్శించి అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశం కానుంది.




## జాతీయ స్థాయిలో ప్రగతి హైస్కూల్ సత్తా

రాయికల్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రగతి హైస్కూల్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. నేషనల్ స్కూల్ అవార్డ్స్–2026లో 'బెస్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్–2026' విభాగంలో ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును పాఠశాల యాజమాన్యం అందుకుంది. న్యూఢిల్లీ ద్వారకలోని ఐటీసీ హోటల్‌లో ఆదివారం జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ బాలె నిఖిల్‌కుమార్, యాజమాన్య ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, మల్లేష్ అవార్డును స్వీకరించారు. తెలంగాణ నుంచి ఈ విభాగంలో ప్రగతి హైస్కూల్ ఎంపికై జాతీయ అవార్డు అందుకోవడం పట్ల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యతోపాటు సమర్థవంతమైన పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ, ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ఈ గుర్తింపు లభించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ బాలె శేఖర్ తెలిపారు. అవార్డు పాఠశాల భవిష్యత్ ప్రగతికి మరింత స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్, ఎన్ఎస్ఏ ఫౌండర్ శిఖా, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్, లోక్‌సభ సెక్రటేరియట్ డిప్యూటీ డైరెక్టర్ నిఖిల్ మిగ్లాని, డాక్టర్ గౌరవ్ కపూర్, సుమిత్ వర్మ, సోమా సింగ్, అభిషేక్ కె. యాదవ్, నీనా భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో మెట్రో - ఆర్టీసీ ఉమ్మడి పాస్

**హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్**




హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): ఉద్యోగం, వ్యాపారం, చదువుతో పాటుగా పలు ఇతరత్రా కారణాలతో అనేక మంది నిత్యం హైదరాబాద్‌లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇందుకోసం మెట్రో, ఆర్టీసీలను ఉపయోగిస్తుంటారు. నిత్యం రాకపోకలు సాగించే వారు ఆర్థిక భారం తప్పుతుందనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్ పాసులు, మెట్రో పాస్ కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇకపై ఇలా వేర్వేరుగా పాసులు కొనుగోలు చేసే ఇబ్బంది ఉండకపోవచ్చు. మెట్రో – ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానం తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆర్టీసీ – మెట్రో ఉమ్మడి పాస్ విధానం వెంటనే అమల్లోకి తేవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నెలవారీ పాసులతో పాటుగా రోజువారీ పాసులు కూడా అందుబాటులోకి తేవాలని సీఎస్ సూచించారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో టీజీఎస్ ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులతో సంజయ్ జాజు ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాస్ అమలుపై చర్చించారు. ఈ క్రమంలోనే ఉమ్మడి పాస్ జారీకి టెక్నికల్‌గా సిద్ధంగా ఉన్నట్లు మెట్రో, టీజీఎస్ ఆర్టీసీ అధికారులు సీఎస్‌కు వివరించారు. ఏ రోజు నుంచి అయినా ఉమ్మడి పాస్ విధానాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఛార్జీలను వేగంగా ఖరారు చేసి, మెట్రో ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానం వెంటనే అమల్లోకి తెచ్చేలా చూడాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో భాగంగా పాతబస్తీలోప్రతిపాదిత మెట్రో కారిడార్ పనులపైనా సీఎస్ సంజయ్ జాజు ఆరా తీశారు. అలాగే రోడ్డు విస్తరణకు సంబంధించిన పనుల గురించి వివరాలు తెలుసుకున్నారు. మెట్రో కారిడార్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని.. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమన్వయ సమావేశం అనంతరం సీఎస్ సంజయ్ జాజు.. మెట్రోలో ప్రయాణించారు. బేగంపేట్ నుంచి ప్యారడైజ్ వరకూ మెట్రో రైలులో ప్రయాణించిన సంజయ్ జాజు.. మెట్రో రైల్వేస్టేషన్లలో పార్కింగ్ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలను పరిశీలించారు. పార్కింగ్ సదుపాయాలు మరింత మెరుగుపరచాలని.. వాణిజ్య స్థలాలను సమర్థంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# విజయవాడ హ్యుందాయ్ షోరూంలో అగ్నిప్రమాదం

**భారీగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా**



విజయవాడ, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): ఏపీలోని విజయవాడలో ఆటోనగర్‌లో ఉన్న హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం నాడు షోరూంకు సెలవు కాగా, ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. భవనం పైఅంతస్తు నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని హ్యుందాయ్ షోరూం భవనం పైభాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భవనం పైఅంతస్తును పూర్తిగా చుట్టుముట్టాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడంతో సమీప నివాసితులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఆదివారం సెలవు కావడంతో షోరూంలో సిబ్బంది గానీ, వినియోగదారులు గానీ ఎవరూ లేరు. ఇదే రోజు పనిదినం అయ్యుంటే ఊహించని స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు అభిప్రాయపడ్డారు. భవనం పైఅంతస్తులో సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేయనున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## 2040 వరకు కాంగ్రెస్‌దే అధికారం: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

## ధర్నాలు కాదు.. అసెంబ్లీకి రండి

**సమాధానం చెప్పేందుకు మేం రెడీ: శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు.. గతంలో వారి ప్రభుత్వ హయాంలో ఇవే హామీలపై కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేకపోయారని మండిపడ్డారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## సెప్టెంబర్ 27న బాల్య వివాహాల నిర్మూలన దినం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): ఈ ఏడాది నుంచి సెప్టెంబర్ 27న అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినంగా నిర్వహించేందుకు ఐక్యరాజ్యసమితి తీర్మానం ఆమోదించిందని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్. నాగరాజు తెలిపారు. బాలికల ఆరోగ్యం, హక్కుల పరిరక్షణతోపాటు బాల్య వివాహాల రహిత భారతదేశం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల నెట్‌వర్క్ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్' ఈ ప్రతిపాదనకు కృషి చేసిందన్నారు. నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది భువన్ రిభు మార్చిలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఈ ప్రతిపాదనను సమర్పించగా 67 దేశాల ప్రతినిధులు మద్దతు తెలిపారని నాగరాజు పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలతో కలిసి తమ నెట్‌వర్క్ ద్వారా నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు.



## యువత మైదానాల్లో ఉండాలి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 6 (ఈవార్తలు): యువత స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా క్రీడా మైదానాల్లో సమయాన్ని గడపాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సూచించారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం నిర్వహించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను పురస్కరించుకుని ఈ ఎంపికలు చేపట్టారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లో లభించే తాత్కాలిక ఆనందం కంటే క్రీడా మైదానంలో పొందే అనుభవాలు జీవితానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం, స్నేహభావం, సమాజంలో గుర్తింపు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక మార్పులు చేపడుతోందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఈ ప్రాంత విద్యారంగానికి తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, రాజన్న సిరిసిల్ల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.


VANGS
GLOBAL TECHNOLOGIES LLP
15 Days Free Trial
Launch Your Own Digital Newspaper Today
Complete ePaper & News Portal Solution
Dashboard
12,450
98,765
1,250
2,350
The Daily News
Global Economy Shows Strong Growth in 2024
City Marathon Sets New Record
BREAKING NEWS • BREAKING NEWS •
CLOUD HOSTING
ePaper Only Pricing
Starter
ePaper Only
10 GB Storage
₹17,999 / Year
★ Most Popular
Professional
ePaper Only
20 GB Storage
₹19,999 / Year
Enterprise
ePaper Only
30 GB Storage
₹21,999 / Year
News Module Add-on: +₹6,000 Extra
Includes full News Portal with all features
Powerful Features
Unlimited News
Unlimited Gallery
Unlimited Web Stories
Unlimited Traffic
SEO Ready
Custom Domain
Push Notifications
Single Click PDF Upload
ePaper Publishing
Breaking News
Live Updates
Custom Menu
Custom Theme
ID Card Designer
Employee News App
Category Management
Heat Track for News Reports & Admin
Multiple Language Support — Yes for All Platforms
ePaper Only Starting from
₹1,799 /month*
Book Free Demo
Start Your 15 Days Free Trial Today
https://vangstechnologies.com
hr@vangstechnologies.com
+91 7675087378



# కాళ్లకు బలపం కట్టుకొని..!

## (మొదలైన ఓట్ల యాత్రలు)

**ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. కానీ రాజకీయ పార్టీలకు మాత్రం ఇప్పటి నుంచే ఎన్నికల వేడి మొదలైనట్టే కనిపిస్తోంది. సభలు, సమావేశాలు, బహిరంగ ప్రకటనలు, విమర్శలు, ప్రతివిమర్శలతో సాగుతున్న రాజకీయాలకు ఇప్పుడు పాదయాత్రల రూపం వస్తోంది. ఒకప్పుడు ప్రజలను కలిసేందుకు రాజకీయ నాయకుడి చేతిలో ఉన్న ప్రధాన ఆయుధం పాదయాత్ర. ఇప్పుడు మళ్లీ అదే అస్త్రం పదును పెడుతోంది. ఏపీలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికలకు ముందుగా మరో విడత పాదయాత్ర చేపట్టే ఆలోచనలో ఉ న్నారు. ఆయన 2017-19 మధ్య చేసిన సుదీర్ఘ పాదయాత్ర అనంతరం 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.**

**తాజా ప్రణాళిక కూడా ఎన్నికలకు సుమారు ఏడాదిన్నర ముందు ప్రజల్లోకి వెళ్లే వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణలోనూ ఇదే వాతావరణం కనిపిస్తోంది. కేటీ రామారావు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేయనున్నట్లు గతంలోనే ప్రకటించారు. 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టే ప్రణాళికపై స్పష్టత ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. సెప్టెంబర్ 14ను గడువుగా పెట్టారు. తాజాగా కేసీఆర్ కూడా పాదయాత్రను ప్రకటించారు. అంటే.. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల రూట్ మళ్లీ రోడ్ల మీదికి మళ్లుతున్నట్టే!**

### పాదయాత్ర అంటే నడక కాదు!

పాదయాత్రను కేవలం నాయకుడు వందల కిలోమీటర్లు నడవడం అనుకుంటే పొరపాటే. రాజకీయంగా చూస్తే పాదయాత్ర ఒక చలనశీల రాజకీయ ప్రచార కార్యాలయం. ఒక నాయకుడు సభ పెడితే ప్రజలు అక్కడికి రావాలి. పాదయాత్రలో నాయకుడే ప్రజల దగ్గరకు వెళ్తాడు. సభలో ప్రజలు నాయకుడిని వింటారు. పాదయాత్రలో నాయకుడు ప్రజలను వింటాడు. సభలో మైక్ ఉ ంటుంది. పాదయాత్రలో మైక్‌తో పాటు ప్రజల ముఖాలు ఉంటాయి. సభలో వేదిక ఉంటుంది. పాదయాత్రలో గ్రామం మొత్తం వేదిక అవుతుంది. అందుకే పాదయాత్రకు రాజకీయాల్లో ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉ ంది. ఒక నాయకుడు వేల కిలోమీటర్లు నడుస్తున్నాడంటే ప్రతి అడుగు ఒక రాజకీయ సందేశంగా మారుతుంది. ప్రతి గ్రామం ఒక వార్తగా మారుతుంది. ప్రతి రైతు సమస్య ఒక ప్రసంగంగా మారుతుంది. ప్రతి కుటుంబంతో మాట్లాడటం ఒక రాజకీయ బంధంగా మారుతుంది. అందుకే పాదయాత్రలు ఎన్నికలకు ముందు నాయకుల రాజకీయ పునర్జన్మకు వేదికలుగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



### వైఎస్సార్.. పాదయాత్రతో అధికారంలోకి!

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో పాదయాత్ర అంటే ముందుగా గుర్తుకు వచ్చేది వై.ఎస్. రాజశేఖర రెడ్డి. 2003లో వైఎస్సార్ చేపట్టిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర అప్పటి రాజకీయ పరిస్థితులను మార్చేసిన కీలక పరిణామంగా నిలిచింది. వందల గ్రామాలు, రైతులు, మహిళలు, పేదలు, నిరుద్యోగులు, కూలీలను కలుస్తూ వైఎస్సార్ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అప్పటివరకు కాంగ్రెస్‌కు దూరంగా ఉన్న వర్గాల్లోనూ ఆయన పాదయాత్ర ప్రభావం చూపింది. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

### జగన్.. 3,600 కిలోమీటర్ల ప్రయాణం!

వైఎస్సార్ తర్వాత ఆయన కుమారుడు జగన్ కూడా పాదయాత్రనే రాజకీయ ఆయుధంగా ఎంచుకున్నారు. 2017 నవంబర్‌లో ప్రారంభమైన 'ప్రజాసంకల్ప యాత్ర' సుమారు 3,600 కిలోమీటర్లకు పైగా సాగింది. దాదాపు ఏడాది పాటు జగన్ గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గాల్లో ప్రజలను కలిశారు. 2019 ఎన్నికలకు ముందు ఈ పాదయాత్ర వైఎస్సార్‌సీపీకి విస్తృత రాజకీయ ప్రచార వేదికగా మారింది. 2019లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. అందుకే ఏపీలో పాదయాత్ర అనేది కేవలం ప్రచార కార్యక్రమం కాదు. అది ఎన్నికల వ్యూహంలో ఒక ప్రత్యేక అధ్యాయం. ఇప్పుడు జగన్ మళ్లీ పాదయాత్ర ఆలోచనలో ఉన్నారనే వార్తలు రావడం కూడా అందుకే ఆసక్తిని రేకెత్తిస్తోంది.



### లోకేశ్.. యువగళంతో కొత్త ముద్ర

2023లో నారా లోకేశ్ ప్రారంభించిన 'యువగళం' కూడా పాదయాత్ర రాజకీయాల్లో మరో కీలక ఉదాహరణ. యువత, ఉద్యోగాలు, పరిశ్రమలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ లోకేశ్ సుదీర్ఘంగా నడిచారు. ఆ పాదయాత్రను తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికలకు ముందు పార్టీ పునరుద్ధరణ కార్యక్రమంగా ఉపయోగించుకుంది. సుమారు 3,100 కిలోమీటర్ల ప్రయాణం లోకేశ్‌కు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పరిచయాన్ని పెంచిందని ఆయన పార్టీ పేర్కొంది. 2024లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఉంది. పాదయాత్రలో నడిచేది నాయకుడు ఒక్కడే కాదు. అతనితో పాటు పార్టీ కూడా నడవాలి. కార్యకర్తలు నడవాలి. స్థానిక నాయకత్వం నడవాలి. ప్రచార యంత్రాంగం నడవాలి. సమస్యలను నినాదాలుగా మార్చాలి. ఆ నినాదాలను ఓట్లుగా మార్చాలి. అప్పుడే పాదయాత్రకు రాజకీయ ఫలితం వస్తుంది.

### చంద్రబాబు పాదయాత్ర కూడా ఓ మలుపే!

చంద్రబాబు నాయుడు కూడా 2012-13లో 'వస్తున్నా మీ కోసం' పేరుతో విస్తృత పాదయాత్ర చేపట్టారు. రాష్ట్ర విభజనకు ముందు ఉన్న ఆ సమయంలో టీడీపీకి తిరిగి ప్రజల్లో బలం పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. చంద్రబాబు నేరుగా ప్రజల్లోకి వెళ్లారు. ఆ పాదయాత్ర తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. అంటే ఏపీ రాజకీయాల్లో వరుసగా కనిపించే ఒక ప్రత్యేక ధోరణి ఉంది

వైఎస్సార్ - ప్రజాప్రస్థానం, చంద్రబాబు - వస్తున్నా మీ కోసం
జగన్ - ప్రజాసంకల్ప యాత్ర, లోకేశ్ - యువగళం

**ఈ పాదయాత్రలన్నీ ఆయా సమయాల్లో ఎన్నికల రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపాయి.**

### తెలంగాణలో పాదయాత్రకు మరో చరిత్ర

తెలంగాణ ఉద్యమ రాజకీయాల్లోనూ పాదయాత్రకు ప్రత్యేక స్థానం ఉ ంది. కేసీఆర్ 2003లో కోదాడ నుంచి హాలియా ప్రాంతం వరకు రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ పాదయాత్ర నిర్వహించిన సందర్భాన్ని కేటీఆర్ ఇటీవల గుర్తు చేశారు. అదే మార్గంలో రైతుల సమస్యల కోసం తాను కూడా పాదయాత్ర చేపడతానని తాజాగా ప్రకటించారు. అంటే పాదయాత్ర ఇప్పుడు కేవలం ఎన్నికల ప్రచార కార్యక్రమం కాదు. తెలంగాణ రాజకీయ జ్ఞాపకాల్లో కూడా అది ఒక ఉద్యమ పద్ధతి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రజలతో నేరుగా మమేకమైన రాజకీయ శైలి, జిల్లాల పర్యటనలు, సభలు, నిరసనలు, ఉద్యమ కార్యక్రమాలు పార్టీని గ్రామస్థాయికి విస్తరించడంలో కీలకంగా పనిచేశాయి. ఇప్పుడు అదే రాజకీయ పద్ధతిని కొత్త తరంలో కేటీఆర్ ఉపయోగించుకోవాలనుకోవడం గమనార్హం.

### 'ఫామ్‌హౌస్' విమర్శలకు సమాధానమా?

తెలంగాణలో ప్రస్తుతం రాజకీయంగా మరో అంశం కూడా ఉంది. కేసీఆర్ చాలా కాలంగా ప్రజల్లో చురుకుగా కనిపించడం లేదని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం కేసీఆర్ ప్రజల్లోకి రావాలని, ప్రతిపక్ష నాయకుడిగా తన పాత్ర పోషించాలని పలుమార్లు విమర్శించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత మళ్లీ ప్రజల్లోకి వస్తే అది కేవలం పార్టీ కార్యక్రమం కాదు. 'కేసీఆర్ ఎక్కడ?' అనే ప్రశ్నకు రాజకీయ సమాధానం కూడా కావచ్చు. ప్రస్తుతం కేటీఆర్ ప్రకటించిన కోదాడ-హాలియా పాదయాత్రకు తక్షణ కారణం నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటి విడుదల సమస్య. ప్రభుత్వం సెప్టెంబర్ 14లోగా స్పష్టమైన నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోతే రైతులతో కలిసి పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించారు. కానీ రాజకీయాల్లో ఒక చిన్న సమస్య పెద్ద రాజకీయ యాత్రకు బీజం కావడం కొత్త కాదు. ఈ రోజు నీటి సమస్య. రేపు రైతు సమస్య. తర్వాత నిరుద్యోగం. ఆ తర్వాత ప్రభుత్వ హామీలు. తర్వాత ఉద్యోగాలు. తర్వాత మహిళల సమస్యలు. అలా ఒక అంశంతో మొదలైన పాదయాత్ర 'ప్రభుత్వం వర్సెస్ ప్రజలు' అనే పెద్ద రాజకీయ ప్రచారంగా మారే అవకాశం ఉంటుంది. కేటీఆర్ కూడా రాష్ట్రవ్యాప్త పాదయాత్ర గురించి ఇప్పటికే మాట్లాడారు.

### తెలంగాణలో ఇక పాదయాత్రల వరదేనా?

ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. కేటీఆర్ పాదయాత్రకు సిద్ధమైతే ఇతర ప్రతిపక్ష నాయకులు కూడా వెనుకబడతారా? అసలు వెనుకబడకపోవచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. బీజేపీ కూడా రాష్ట్ర రాజకీయాల్లో తన స్థానం పెంచుకునే ప్రయత్నంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి పార్టీకి 'ప్రజల మధ్య ఎవరు ఎక్కువగా ఉన్నారు?' అనే ప్రశ్న కీలకం. అందుకే భవిష్యత్తులో తెలంగాణలో మరిన్ని పాదయాత్రలు కనిపించే అవకాశం ఉ ంది. ఎవరైనా రైతుల పేరుతో నడవొచ్చు. ఎవరైనా నిరుద్యోగుల పేరుతో నడవొచ్చు. ఎవరైనా మహిళల సమస్యలపై నడవొచ్చు. ఎవరైనా గ్రామీణ సమస్యలపై నడవొచ్చు. ఎవరైనా ప్రభుత్వ వైఫల్యాల పేరుతో నడవొచ్చు. మరో నాయకుడు అభివృద్ధి పేరుతో నడవొచ్చు. చివరకు అందరి గమ్యం మాత్రం ఎన్నికలే! సోషల్ మీడియా కాలంలో కూడా పాదయాత్రలకు ఎందుకింత ప్రాధాన్యం? కారణం చాలా సులభం. ప్రజలకు దగ్గరగా కనిపించాలి. ఇటీవలి కాలంలో రాజకీయాల్లో నాయకుడు-ప్రజల మధ్య దూరం పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. సామాజిక మాధ్యమాలు, టెలివిజన్, భారీ సభలు, హెలికాప్టర్ పర్యటనలు ఉన్నా నాయకుడు ఇంటింటికీ వెళ్లిన అనుభూతి మాత్రం వేరుగా ఉంటుంది. ఒక నాయకుడు ఒక గ్రామంలోకి నడుచుకుంటూ వస్తే... పిల్లలు చూస్తారు. మహిళలు బయటకు వస్తారు. రైతులు సమస్య చెబుతారు. యువకులు ఉద్యోగాల గురించి అడుగుతారు. వృద్ధులు తమ కష్టాలు చెబుతారు. ఆ దృశ్యమే రాజకీయ ప్రచారానికి పెద్ద ఆయుధంగా మారుతుంది. పాదయాత్రలో నాయకుడు ప్రజలకు కనిపించడమే కాదు.. ప్రజల జీవితాలు నాయకుడికి కనిపిస్తాయి.

### ఈసారి పాదయాత్రల లక్ష్యం ఏమిటి?

రాజకీయంగా చూస్తే ఈసారి పాదయాత్రలకు మూడు ప్రధాన లక్ష్యాలు కనిపిస్తున్నాయి. ప్రజల్లోకి మళ్లీ వెళ్లడం- ఎన్నికలకు చాలా ముందుగానే ప్రజలతో సంబంధాలు పెంచుకోవడం. పార్టీని గ్రామస్థాయిలో పునర్నిర్మించడం- పార్టీ నాయకత్వానికి దూరమైన కార్యకర్తలను, స్థానిక నాయకులను మళ్లీ కలుపుకోవడం. ఎన్నికల కథనాన్ని ముందుగానే నిర్మించడం- ఎన్నికల సమయానికి ప్రజల మనసులో ఒక ప్రశ్నను బలంగా నాటడం. ఎవరికి ఓటు వేయాలి? అంతకంటే ముందుగా... ఎవరు మన కోసం నడిచారు? అనే ప్రశ్నకు సమాధానం తయారు చేయడం. పాదయాత్రలు ఇప్పుడు కేవలం రోడ్ల మీద జరిగేవి కావు. ఒక నాయకుడు ఉదయం పది కిలోమీటర్లు నడిస్తే.. ఆ పది కిలోమీటర్లకు వంద వీడియోలు వస్తాయి. వంద ఫొటోలు వస్తాయి. వేల సోషల్ మీడియా పోస్టులు వస్తాయి. లక్షల మంది చూస్తారు. అంటే ఒక అడుగు నేల మీద పడుతుంది.. దాని ప్రభావం డిజిటల్ ప్రపంచంలో వేల అడుగులు వేస్తుంది. అందుకే పాదయాత్రలు గతం కంటే ఇప్పుడు మరింత శక్తివంతమైన ప్రచార సాధనాలుగా మారే అవకాశం ఉంది.



లవ్లీ చిత్రం



రాశీ సింగ్



## 'మన ప్యానల్' క్లీన్ స్వీప్

తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి 2026–28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు నిర్వహించిన ఎన్నికలు ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగగా.. మొత్తం 1168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో 'మన ప్యానల్', 'ప్రోగ్రెసివ్ ప్యానల్' మధ్య గట్టి పోటీ నెలకొనగా కీలక పదవుల్లో 'మన ప్యానల్' ఆధిపత్యం ప్రదర్శించింది. నిర్మాతల మండలి అధ్యక్షుడిగా సి.కల్యాణ్ ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఎన్నికల్లో ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ఈసీ సభ్యుల పదవుల్లో పలువురు విజయం సాధించారు. ట్రెజరర్‌గా చదలవాడ శ్రీనివాసరావు విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి 'మన ప్యానల్' నుంచి మోహన్ వడ్లపట్ల గెలుపొందగా.. 'ప్రోగ్రెసివ్ ప్యానల్' నుంచి దామోదర్ ప్రసాద్ విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీలుగా 'మన ప్యానల్' నుంచి అమ్మిరాజు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యుల విషయంలోనూ 'మన ప్యానల్' భారీ ఆధిక్యం సాధించింది. ఆ ప్యానల్ నుంచి 12 మంది సభ్యులు విజయం సాధించారు. పద్మిని, ఎషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య, వంశీ నందిపాటి, పల్లి కేశవరావు, శ్రీనివాసరావు, పుల్లారావు, బాపిరాజు, ఆర్.కె. కౌడ్, నయీం ఈసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇక 'ప్రోగ్రెసివ్ ప్యానల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డీఎస్ రావు ఈసీ సభ్యులుగా గెలుపొందారు. అయితే జనరల్ సెక్రటరీ పదవికి సంబంధించిన కేసు ప్రస్తుతం కోర్టులో ఉండటంతో ఆ పదవిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం



ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో అతడిపై ఫిర్యాదు చేసిన మూడు రోజులకే ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గత ఆగస్టు 22వ తేదీన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ తెలంగాణ హైకోర్టును ఈశ్వర్ సాయి ఆశ్రయించాడు. పెళ్లి పేరుతో నమ్మించి తనను మోసం చేశాడంటూ బాధితురాలు మాధురి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అతడిని పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆరోపించారు. ఈ కేసు నమోదైన తర్వాత ఈశ్వర్ సాయి పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## అట్టహాసంగా బిగ్‌బాస్-10 షురూ

తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్గెస్ట్ రియాలిటీ షో 'బిగ్‌బాస్' పదో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. హోస్ట్ అక్కినేని నాగార్జున గ్రాండ్ ఎంట్రీతో ఈ షోకు ఘనంగా తెరలేచింది. స్టార్ మా ఛానెల్‌తో పాటు జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న ఈ లాంచ్ ఈవెంట్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రోమోలు, కొత్త హౌస్ డిజైన్‌తో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచిన ఈ సీజన్, ఊహించని సర్ ప్రైజ్‌లతో మొదలైంది. ఈసారి బిగ్‌బాస్ లాంఛ్ ఓ అరుదైన ఘట్టానికి వేదికైంది. బిగ్‌బాస్ చరిత్రలోనే తొలిసారిగా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో షోలు ఒకేసారి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా భాషల హోస్టులు నాగార్జున, మోహన్‌లాల్, కిచ్చా సుదీప్, విజయ్ సేతుపతి ఒకే స్క్రీన్‌పై కనిపించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది దక్షిణాది బుల్లితెరపై ఒక కొత్త అధ్యాయంగా చెప్పుకోవచ్చు. ఇక హౌస్‌లోకి అడుగుపెట్టిన తొలి కంటెస్టెంట్‌గా నటి దేబ్జానీ మోదక్ నిలిచారు. 'ఛాంపియన్' సినిమాలోని "గిర్ర గిర్ర గిర్ర గింగిరానివే" పాటకు పవర్‌ఫుల్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌తో హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. రెండో కంటెస్టెంట్ గా నటుడు త్రిగుణ్ ఎంట్రీ ఇచ్చారు. అంతకుముందు, హోస్ట్ నాగార్జున స్వయంగా హౌస్‌లోకి వెళ్లి ఓ మ్యాజిక్ కీ గురించి వివరించారు. ఈసారి ఈ 'కీ' చాలా కీలకం కానుందని, అది కంటెస్టెంట్ల తలరాతను మార్చేస్తుందని చెప్పి మొదటి రోజు నుంచే ఉత్కంఠను పెంచారు. రోబో ఎంట్రీతో వైరల్ అయిన కొత్త హౌస్ డిజైన్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.






## వశిష్ఠ దర్శకత్వంలో మోక్షజ్ఞ ఎంట్రీ

నందమూరి అభిమానులు, తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న శుభ తరుణం రానేవచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తేజ సినీ అరంగేట్రం అధికారికంగా ఖరారైంది. అతడి తొలి చిత్రానికి 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనుంది. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ భారీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మైత్రీ మూవీ మేకర్స్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ ఫొటోలో బాలకృష్ణ, మోక్షజ్ఞ, దర్శకుడు వశిష్ట ముగ్గురూ కలిసి కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా మేకర్స్ ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్‌ను జోడించారు. "డెన్‌ను వదిలిన కూన ఇప్పుడు సింహంలా అడవిలోకి ఎంటర్ అయింది" అంటూ మోక్షజ్ఞ ఎంట్రీని అభివర్ణించారు. ఈ ప్రకటనతో నందమూరి అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కొన్నేళ్లుగా మోక్షజ్ఞ ఎంట్రీ ఈ ప్రకటనతో పూర్తిస్థాయిలో తెరపడినట్లయింది. 'బింబిసార' చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వశిష్ట,

## ఎన్‌బీకే 111.. దాదా



బాలకృష్ణ అభిమానులు చాలాకాలంగా ఎదురు చూస్తున్న రోజు వచ్చేసింది. అంతేగాక అనేక అనుమానాలకు చెక్ పెడుతూ ఫ్యాన్స్ ఎదురు చూపులకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. అదివారం మోక్షజ్ఞ తేజ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్‌బీకే 111 నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. సినిమా టైటిల్ 'దాదా' అని అధికారికంగా ప్రకటించడంతో పాటు డిసెంబర్ 24న సినిమాను థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు ప్రకటించారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఎక్కడా రాజీపడకుండా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' ఫస్ట్ గ్లింప్స్‌లో బాలయ్య అల్ట్రా స్టైలిష్, పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించి మాస్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించారు. ఇక తాజాగా విడుదల చేసిన గ్లింప్స్ స్టన్నింగ్‌గా ఉండి బాలయ్య నుంచి ఫ్యాన్స్ అశించే కోరుకునే అంశాలను అన్నింటినీ రంగరించి మరీ సినిమాను స్టైలీష్‌గా రూపొందిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.



## నా కెరీర్ నాశనం చేశారు

బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా యూనివర్స్ తనూశ్రీ దత్తా సోషల్ మీడియాలో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో కష్టాలకు, కెరీర్‌లో ఎదుగుదలకు అడ్డుపడిన వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ, తనకు అన్యాయం చేసిన వారు తప్పకుండా పర్యవసానాలు ఎదుర్కొంటారని, వారి పతనాన్ని తాను కళ్లారా చూస్తానని పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నన్ను నా సహజ మార్గం నుంచి పక్కకు తప్పించి, బాధపెట్టిన వారికి చెబుతున్నా. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు మళ్లీ అద్భుతంగా పుంజుకుంటాయి. నా తప్పు లేకుండా నన్ను బాధించిన ప్రతి ఒక్కరి పతనాన్ని నేను చూస్తాను" అని తనూశ్రీ రాసుకొచ్చారు. "కర్మ చక్రాలు తిరుగుతున్నాయి. రాబోయే కాలం నాది. నాపై కుట్రలు పన్ని, నన్ను మానసికంగా హింసించి, నాపై నిఘా పెట్టి దాడి చేసిన ఆ దుర్మార్గులు భయంకరమైన శక్తుల చేతిలో చిక్కి శాశ్వతంగా వేధింపులకు గురవుతారు. వాళ్లు చేసిన పాపాలకు వాళ్లే పశ్చాత్తాపపడతారు. వాళ్ల జీవితాలు వాళ్ల కళ్ల ముందే నాశనమవుతాయి" అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

# చైనా మాస్టర్స్.. సాత్విక్-చిరాగ్

### చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం

### తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా కంబ్యాక్



**భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.**

గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.



# డీజీపీ కొడుక్కి దొరికిపోయిన వైభవ్

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసేసరికి ఈస్ట్ జోన్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగుల భారీ స్కోరు చేసి పటిష్ఠ స్థితిలో నిలిచింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111) అజేయ శతకంతో కదంతొక్కగా, మరోవైపు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడైన ఆటకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడు, పేసర్ చామా మిలింద్ కళ్లెం వేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్‌కు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72), వైభవ్ సూర్యవంశీ శుభారంభం ఇచ్చారు. ముఖ్యంగా, అందరి దృష్టిని ఆకర్షించిన 15 ఏళ్ల వైభవ్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. కేవలం 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 44 పరుగులు చేసి సౌత్ జోన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌ను లక్ష్యంగా చేసుకుని ఒకే ఓవర్లో ఒక సిక్స్, రెండు ఫోర్లతో 14 పరుగులు రాబట్టాడు. సిరాజ్ బౌలింగ్‌లో ఎదుర్కొన్న 12 బంతుల్లోనే మూడు ఫోర్లు, ఒక సిక్స్ బాది అతనిపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. అయితే, ప్రమాదకరంగా మారుతున్న వైభవ్ దూకుడుకు సౌత్ జోన్ బౌలర్ చామా మిలింద్ బ్రేక్ వేశాడు. 15వ ఓవర్లో మిలింద్ వేసిన షార్ట్ బంతికి సబ్ స్టిట్యూట్ ఫీల్డర్ తనయ్ త్యాగరాజన్‌కు క్యాచ్ ఇచ్చి వైభవ్ పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్‌కు లభించిన తొలి వికెట్ ఇదే కావడం విశేషం. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శిఖర్ మోహన్ (85) కూడా అద్భుతంగా రాణించాడు. శతకం దిశగా సాగుతున్న శిఖర్‌ను కూడా మిలింద్ తన షార్ట్ బాల్ వ్యూహంతో పెవిలియన్ చేర్చాడు.



# ఇషాన్.. సెంచరీ

## తొలిరోజు ఈస్ట్‌జోన్‌దే

చెన్నై చిదంరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్ తొలిరోజే స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. ఈస్ట్‌జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అజేయ సెంచరీతో కదం తొక్కడంతో ఆ జట్టు భారీ స్కోరు దిశగా పరుగులు పెడుతోంది. ఆదివారం సౌత్‌జోన్‌తో మొదలైన ఫైనల్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్‌జోన్ 79 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (135 బంతుల్లో 111 నాటౌట్), కుమార్ కుషాగ్ర (75 బంతుల్లో 63 నాటౌట్) క్రీజులో ఉన్నారు. సౌత్‌జోన్ బౌలర్లలో సీవీ మిలింద్ 2 వికెట్లు తీయగా, త్రిపురాణా విజయ్ ఒక వికెట్ పడగొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్‌జోన్‌కు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. వన్డే తరహాలో వేగంగా ఆడిన వైభవ్ సూర్యవంశీ (35 బంతుల్లో 44, 5 ఫోర్లు, ఒక సిక్సర్) దంచికొట్టాడు. మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (86 బంతుల్లో 72 పరుగులు) మరో ఎండ్‌లో నింపాదిగా ఆడాడు. వైభవ్ ఔటయ్యాకా బరిలోకి దిగిన శ్రీకర్ మోహన్ (120 బంతుల్లో 85 పరుగులు) కూడా తనదైన శైలి బ్యాటింగ్‌తో అలరించాడు. అభిమన్యు, సుదీప్ కుమార్ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగిన్పటికీ, శిఖర్‌కు జత కలిసిన ఇషాన్ కిషన్ చెలరేగిపోయాడు. సౌత్‌జోన్ బౌలింగ్‌ను చీల్చి చెండాడిన ఇషాన్ అర్ధసెంచరీ మార్క్ చేరుకున్నాడు. శిఖర్ ఔటైనప్పటికీ, కుమార్ కుషాగ్ర వేగంగా ఆడి పరుగులు రాబట్టాడు. ఇషాన్ కిషన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాగా ఇషాన్ కిషన్‌కు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇది పదో సెంచరీ. అనంతరం కాసేపటికే కుమార్ కుషాగ్ర కూడా అర్ధసెంచరీ సాధించాడు. ఈ నేపథ్యంలో మరో 10 ఓవర్లు మిగిలి ఉండగానే బ్యాడ్‌లైట్ కారణంగా అంపైర్లు తొలి రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు.



# ఓడినా మేమే బెస్ట్: పాక్ కోచ్

మహిళల ఆసియా కప్ 2026లో భాగంగా నిన్న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే, ఈ ఓటమి తర్వాత పాక్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్ చేసిన వ్యాఖ్యలు క్రీడా వర్గాలను విస్తుపోయేలా చేశాయి. టీమిండియా చేతిలో చిత్తుగా ఓడినప్పటికీ, ఈ టోర్నీలో తమ జట్టే అత్యుత్తమమైనదని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్, భారత బౌలర్ల ధాటికి కేవలం 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ, షావల్ జుల్ఫికర్ మినహా మరే బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 3, దీప్తి శర్మ 2, ప్రేమ రావత్ 2 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. అనంతరం 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా కేవలం 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన వహాబ్ రియాజ్.. "మా జట్టులోని క్రీడాకారిణులంతా ఎంతో నైపుణ్యం ఉన్నవారు. వారు తమను తాము నమ్మాలి. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేసిన తప్పులపై చర్చిస్తాం. వాటిని పునరావృతం చేయకుండా చూసుకుంటాం. ఈ ఆసియా కప్‌లో ట్రోఫీ గెలవడానికి పాకిస్థానే



అత్యుత్తమ జట్టు అని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులు మాకు బాగా అనుకూలిస్తాయి" అని వ్యాఖ్యానించాడు. అయితే, జట్టు కూర్పు విషయంలో కోచ్ వహాబ్ రియాజ్‌తో కెప్టెన్ సనా మీర్ పూర్తిగా విభేదించింది. ఆసియా కప్ కోసం ఏకంగా 7 మంది క్రీడాకారిణులను జట్టు నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కెప్టెన్ వ్యాఖ్యలపై వహాబ్ రియాజ్ స్పందిస్తూ.. "అది సనా మీర్ వ్యక్తిగత అభిప్రాయం. దానితో నాకు సంబంధం లేదు. మేము భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ మార్పులు చేశాం.

# షమీ తలుపులు మూయొద్దు: భరత్ అరుణ్

టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. 36 ఏళ్ల షమీ, ఏడాదికి పైగా భారత జట్టుకు దూరంగా ఉంటున్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో చివరిసారిగా ఆడిన అతను, గాయాల కారణంగా జట్టులో చోటు కోల్పోయాడు. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యువ ఆటగాళ్ల వైపు మొగ్గు చూపుతుండటంతో షమీ కెరీర్ ముగిసినట్లేనని చాలామంది భావిస్తున్నారు. అయితే, టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించాడు. షమీలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని, అతని కోసం జట్టు తలుపులు మూయకూడదని గట్టిగా వాదిస్తున్నాడు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ, భరత్ అరుణ్ షమీకి మద్దతుగా నిలిచాడు. "షమీ కోసం తలుపులు మూసివేయకూడదు. అతనిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది. ఒక ఆటగాడు నిలకడగా రాణిస్తున్నప్పుడు, వయసును కారణంగా చూపకూడదు.

# కౌంటీల్లో సాయి కిశోర్ హవా



భారత జట్టులో చోటు కోసం ఎదురుచూస్తోన్న తమిళనాడు స్పిన్నర్ సాయి కిశోర్ మరోసారి సత్తా చాటాడు. ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో గ్లాస్టర్‌షైర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న కిశోర్.. అదిరిపోయే ప్రదర్శన చేశాడు. డెర్బీషైర్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. తన సూపర్ స్పెల్‌తో టీమిండియా సెలెక్టర్లకు మరోసారి సవాల్ విసిరాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో సాయి కిశోర్‌కు మంచి రికార్డు ఉంది. రంజీ ట్రోఫీలో నిలకడగా రాణిస్తున్న అతడు.. ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లోనూ వరుసగా ప్రభావం చూపిస్తున్నాడు. అయినా భారత టెస్టు జట్టులో మాత్రం అతడికి చోటు దక్కడం లేదు. కౌంటీ క్రికెట్‌లో ఇలాంటి ప్రదర్శనలతో టెస్టు క్రికెట్‌కు సిద్ధంగా ఉన్నాననే సంకేతాన్ని సాయి కిశోర్ మరోసారి సెలెక్టర్లకు పంపాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు, ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా ఉండటం, ఇంగ్లండ్ పరిస్థితుల్లోనూ రాణించే సామర్థ్యం.. ఇవన్నీ అతడికి కలిసొచ్చే అంశాలే. భారత టెస్టు జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉంది. సీనియర్ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యువ ప్లేయర్ల కోసం టీమ్ మేనేజ్‌మెంట్ చూస్తోంది. ఈ నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో భారత టెస్టు జట్టు భవిష్యత్తు ప్రణాళికల్లో సాయి కిశోర్ కీలక ఎంపికగా మారే అవకాశం ఉంది. రంజీ ట్రోఫీతో పాటు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లోనూ వరుసగా తనను తాను నిరూపించుకుంటున్న ఈ తమిళనాడు స్పిన్నర్.. ఇకనైనా సెలెక్టర్ల దృష్టిలో పడతాడా? అన్నది చూడాలి.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 7-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## మాటల మంటలు.. సమస్యల మౌనాలు

తెలంగాణ ప్రజలు రాజకీయ చర్చలకు కొత్తవారు కాదు. ఈ రాష్ట్రం ఉద్యమాల నుంచి పుట్టింది. హక్కుల కోసం పోరాడిన ప్రజలకు రాజకీయ నాయకుల ప్రసంగాలు కొత్తేమీ కాదు. కానీ ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్షలే రాజకీయాలకు కేంద్రబిందువైతే.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే ప్రజలు కేంద్రబిందువుగా ఉండాలి. అధికారం వచ్చిన తర్వాత కూడా ప్రతిపక్షమే రాజకీయ చర్చకు కేంద్రంగా ఉంటే.. పాలన ఎక్కడుంది? ప్రతిపక్ష నాయకుడు ఏం అన్నాడు? గత ప్రభుత్వం ఏం చేసింది? గత పాలనలో ఏం తప్పు జరిగింది? ఎవరు ఎంత అవినీతి చేశారు? ఎవరు ఎక్కడ విఫలమయ్యారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం అవసరమే. కానీ అదే సమయంలో మరో ప్రశ్న మరింత ముఖ్యమైనది. "ఇప్పుడు ప్రభుత్వం ఏం చేస్తోంది?" ప్రజలు ఈ ప్రశ్నకు సమాధానం కోరుతున్నారు. గతాన్ని తవ్వడం ద్వారా రాజకీయ ప్రయోజనం రావచ్చు. కానీ భవిష్యత్తును నిర్మించడం ద్వారానే ప్రజలకు ప్రయోజనం వస్తుంది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. దాని వెనుక ప్రజల తీర్పు ఉంటుంది. ఆ తీర్పులో ఆశ ఉంటుంది. ఆకాంక్ష ఉంటుంది. మార్పు కోసం ఎదురుచూపు ఉంటుంది. గత పాలనపై అసంతృప్తి ఉండవచ్చు. కొత్త నాయకత్వంపై నమ్మకం ఉండవచ్చు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజలు ఐదేళ్లకు ఒకసారి ఓటు వేసి తమ పని అయిపోయిందనుకోరు. ప్రభుత్వం ప్రతిరోజూ పనిచేయాలని కోరుకుంటారు. అధికారంలో ఉన్నవారు ప్రతిరోజూ ఒకటే గుర్తుంచుకోవాలి.. ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక విజయం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను పరిష్కరించడం అసలు విజయం. ముఖ్యమంత్రి మైక్ ముందు కాదు.. ప్రజల మధ్య ఉండాలి. ముఖ్యమంత్రి ప్రసంగం చేయకూడదని ఎవరూ అనరు. రాజకీయంగా స్పందించకూడదని కూడా అనరు. కానీ ఒక ముఖ్యమంత్రి గొంతులో వినిపించాల్సిన ప్రధాన స్వరం రాజకీయ విమర్శలది కాకుండా ప్రజా సమస్యల పరిష్కార స్వరం కావాలి. రైతులకు ఏం చేశాం? విద్యార్థులకు ఏం చేశాం? మహిళలకు ఏం చేశాం? ఉద్యోగాల విషయంలో ఎంత ముందుకెళ్లాం? పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చాం? వైద్య రంగంలో ఎలాంటి మార్పు తీసుకొచ్చాం? పాఠశాలల పరిస్థితి ఎలా మార్చాం? గ్రామాలకు నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం ఎలా మెరుగుపరిచాం? రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎలా బలోపేతం చేస్తున్నాం? ఇలాంటి అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడితే.. అది పాలనకు నివేదిక అవుతుంది. ప్రత్యర్థి నాయకుడి వ్యక్తిగత వ్యవహారాలపై మాట్లాడితే.. అది కేవలం రాజకీయ విమర్శగా మిగిలిపోతుంది. ప్రజలకు నివేదిక కావాలి.. రచ్చ కాదు.

# కొండాపై వేటు.. కోమటిరెడ్డికి సీటు!?



**రాజగోపాల్‌రెడ్డికి రక్షణా?**
**కొండా సురేఖకు భక్షణా?**

సీఎంను ప్రశ్నిస్తే
రాజకీయ స్వేచ్ఛా?
బిడ్డ మాట్లాడితే
తల్లి పదవిపై శిక్షా?

**ఒకరికి మాటకు మన్ననా?**
**మరొకరికి మాటకు మంత్రి పదవి గండమా?**

రాజకీయ బలానికి
ఒక కొలమానమా?
బీసీ బిడ్డ ముక్కుసూటితనానికి
మరో కొలమానమా?

**ఒకే పార్టీ.. ఒకే అధికారం..**
**కానీ క్రమశిక్షణకు రెండు తూకాలా?**

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ ఎపిసోడ్ ఒక మలుపు మాత్రమే. అసలు కథ రేవంత్‌రెడ్డి రాజకీయ అడుగుల్లో ఉంది. ఒక సమస్య వేడెక్కుతుంటే మరో సమస్యను ముందుకు తేవడం.. ఒక వర్గంలో అసంతృప్తి పెరగకముందే మరో వర్గానికి హామీ ఇవ్వడం.. ప్రత్యర్థి ప్రశ్నించకముందే అతనిపైనే మరో ప్రశ్న సంధించడం.. ఇదే రేవంత్ రాజకీయ శైలిగా కనిపిస్తోందనే చర్చ సాగుతోంది. కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోవడం, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు ఈ చర్చకు కేంద్రంగా మారాయి. సుస్మిత తన వ్యాఖ్యలకు తన తల్లిని ఎందుకు బలి చేశారని ప్రశ్నించడంతోపాటు, గతంలో బండి సంజయ్ కుమారుడి వ్యవహారంలో తండ్రిని కుమారుడి తప్పుకు బాధ్యుడిని చేయలేమన్న తరహా వాదనను రేవంత్ ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. సురేఖ వ్యవహారంపై బీసీ వర్గాల్లోనూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అదే సమయంలో కొండా సురేఖను తప్పించిన వెంటనే బీసీ మహిళలకు కీలక బాధ్యతలు దక్కడం మరో చర్చకు దారితీసింది. ఒక బీసీ మహిళా మంత్రి ఇంటికి వెళ్తే.. వెంటనే మరో బీసీ మహిళలకు పదవులు ఎందుకు? ఇది సహజ సామాజిక సమీకరణమా? లేక ముందే సిద్ధమైన రాజకీయ లెక్కా? ఎవరికెవరికీ ఏ పదవి ఇవ్వాలన్న జాబితా ముందే సిద్ధమైందా? సురేఖ వ్యవహారం ఆ లెక్క అమలుకు అనుకూలంగా మారిందా? అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. దీనిని నిర్ధారిత వాస్తవంగా చెప్పడానికి ఆధారాలు లేకపోయినా, పదవి పోయిన వెంటనే కొత్త పదవుల పందిరి ఎందుకు? అన్న ప్రశ్న మాత్రం నిలుస్తోంది. ఇదే సమయంలో ఢిల్లీ పరిణామాలపైనా చర్చ సాగింది. సురేఖపై చర్య పార్టీ అధిష్ఠానం వరకు వెళ్లి నిర్ణయం రావడం రేవంత్ రాజకీయ ప్రభావంపై చర్చకు దారితీసింది. ఢిల్లీకి ఫైలు వెళ్లింది.. నిర్ణయం వచ్చింది.. మధ్యలో రాజకీయ చక్రం ఎవరు తిప్పారు? అన్నదే ప్రశ్న. ఎవరిని ఎలా ఒప్పించారో చెప్పడానికి బహిరంగ ఆధారాలు లేకపోయినా, నిర్ణయం అమలైన వేగం మాత్రం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. ఇక రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం మరో త్రాసును ముందుకు తెస్తోంది. మంత్రి పదవి దక్కకపోతే ముఖ్యమంత్రి అవుతాననే స్థాయిలో ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వార్తల్లోకి వచ్చాయి. అక్కడ మాటకు మన్ననా? ఇక్కడ మాటకు మంత్రిపదవి గండమా? ఒకే పార్టీ.. ఒకే ప్రభుత్వం.. ఒకే ముఖ్యమంత్రి.. మరి రాజకీయ క్రమశిక్షణకు రెండు కొలమానాలా? ఇదే ప్రజల ప్రశ్న. ఇంతలో బీసీ అంశం పెద్ద రాజకీయ చర్చగా మారకముందే రేవంత్ మరో బంతిని కేసీఆర్ కోర్టులోకి విసిరారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు జీతభత్యాలుగా, ఇతర ఖర్చులుగా భారీ మొత్తం చెల్లిస్తున్నా అసెంబ్లీకి రాకపోవడంపై రేవంత్ తీవ్రంగా విమర్శించారు.

**సురేఖపై చర్చ మొదలైతే.. కేసీఆర్‌పై పంచ్!**
**కేసీఆర్ నోరు తెరిస్తే.. జీతం లెక్క!**
**ప్రతిపక్షం ప్రశ్నిస్తే.. గత పాలన లెక్క!**
**ఇదేనా రేవంత్ స్టెప్పు?**

కేసీఆర్ కూడా ఈరోజు వెనక్కి తగ్గలేదు. రేవంత్ వ్యాఖ్యలను "చిల్లర మాటలు"గా అభివర్ణిస్తూ, పాలన చేతకాక బూతులు మాట్లాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అయిందని, "థర్డ్‌క్లాస్ పాలన"గా అభివర్ణించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమని, అందుకే దోపిడీలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు చేశారు. ఇవన్నీ కేసీఆర్ చేసిన రాజకీయ ఆరోపణలే; వాటిపై తుది తీర్పు ప్రజలదే. ఇక్కడే తెలంగాణ రాజకీయాల అసలు మజా మొదలవుతోంది. ఒకరు అంటారు-ఫామ్‌హౌస్ నుంచి బయటికి రా! మరొకరు అంటారు-పాలన చేతకాక చిల్లర మాటలు మానుకో! ఒకరు అంటారు-జీతం తీసుకుంటూ అసెంబ్లీకి రావా? మరొకరు అంటారు-వెయ్యి రోజుల పాలనలో చేసిందేమిటి? అంటే అసలు యుద్ధం ఇప్పుడు మాటలకే పరిమితం కాలేదు. ఎవరి పాలనకు ప్రజలు మార్కులు వేస్తారన్న దానిపైకి వచ్చింది. రేవంత్ మాత్రం అక్కడితో ఆగడం లేదు. సెప్టెంబర్ 5న గజ్వేల్‌లోనే తేల్చుకుందామని కేసీఆర్‌కు సవాలు విసరడం, సిరిసిల్ల-సిద్దిపేట-గజ్వేల్‌లో బీఆర్ఎస్ బలగాలను ఓడిస్తామని ప్రకటించడం ఆయన దూకుడు రాజకీయానికి మరో ఉదాహరణ. ఇక కొడంగల్‌లో ఉపాధ్యాయుల సమస్యలపై రెండేళ్లు సమయం ఇవ్వాలని కోరడం కూడా మరో రాజకీయ లెక్కగా కనిపిస్తోంది. సమస్య రోడ్డెక్కకముందే సమయం అడుగు.. ఆగ్రహం పెరగకముందే హామీ ఇవ్వు.. ఎన్నికల మార్కుల పత్రం ముందే ప్రజల చేతిలో పెట్టు! ఇది వ్యూహమా? నిజమైన పరిపాలనా సమయమా? కాలమే చెప్పాలి. ఇలా చూస్తే రేవంత్ రాజకీయ శైలి ఒకే అంశం చుట్టూ తిరగడం లేదు. సురేఖ వివాదం వస్తే బీసీ సమీకరణం.. కేసీఆర్ విమర్శిస్తే ఫామ్‌హౌస్ లెక్క.. ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే రెండేళ్ల గడువు.. ప్రతిపక్షం దాడి చేస్తే గత ప్రభుత్వ పాలన లెక్క.

ప్రశ్నకు సమాధానం చెప్పడమే కాదు..
ప్రశ్నించినవాడిపైనే మరో ప్రశ్న వేయడం!
ఇదే రేవంత్ రాజకీయ చాణక్యమా?

మద్దతుదారులు దాన్ని రాజకీయ చతురత అంటారు. విమర్శకులు దృష్టి మళ్లించే వ్యూహమంటారు. నిజం ఏదైనా ఒక విషయం మాత్రం స్పష్టం-రేవంత్‌రెడ్డిని ఎదుర్కోవాలంటే ఆయన మాటకు సమాధానం చెప్పడం మాత్రమే సరిపోదు; ఆయన తర్వాతి అడుగును కూడా పసిగట్టాలి. అయితే చాణక్యం ఎంత పదునుగా ఉన్నా ప్రజల తీర్పును మించదు. పదవులు మార్చవచ్చు.. పార్టీ సమీకరణాలు మార్చవచ్చు.. విమర్శల దిశ మార్చవచ్చు.. కానీ ప్రజల ఓటు దిశను మార్చడం ఎవరి చేతిలోనూ ఉండదు. కొండా సురేఖ ఎపిసోడ్ అయినా.. రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం అయినా.. కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం అయినా.. ఉపాధ్యాయుల రెండేళ్ల గడువు అయినా.. ప్రతి అంశం చివరికి ఒకే ప్రశ్న దగ్గరికి వస్తుంది. రేవంత్ పావులు కదుపుతున్నారా? లేక పావులు కదిలినప్పుడల్లా తనకు అనుకూలంగా బోర్డు మార్చుతున్నారా? దానికి సమాధానం రాజకీయ నాయకులు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు చూస్తున్నారు.. ప్రజలు గుర్తుంచుకుంటున్నారు.

తీర్పు మాత్రం ప్రజల చేతిలోనే ఉంది!



**శ్రీశైలం దూడం**
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.